# బస్ ప్రయాణం

## శిరీష

''అరె ఆగండిభయ్! ఎక్కడికి లోపలికి తోసుకెళ్తుంద్రు. ముందు టికెట్ తీస్కోని గాడీ ఎక్కండి'' కండెక్టర్ అరుస్తున్నాడు

కండెక్టర్ కాకీ దుస్తుల్లో ఉన్నాడు. చెవులకు దుద్దులు. చెవి సందున పెన్సిల్, చేతిలోటికెట్ల ఫలక.

వాకిలిదగ్గరే కండెక్టర్ సీటులో కూర్చున్నాడు. వాకిలికి చేతు లడ్డంపెట్టి ఎక్కే వాళ్లను నెట్టేస్తున్నాడు. ఒక్క ఊపు ఊపి తలుపు దభాలున వేసేసుకున్నాడు.

అతడు ఊపిన ఊపుకు గుంపు చెదిరి వెనక వరుసలో నిల్చున్న ఒక స్త్రీ క్రింద పడింది ఆమెచుట్టూ కొంతమంది జనం మూగారు.

''ఇదో కండెక్టర్! కండెక్టర్! నాకు అడ్వాన్సు బుకింగ్ వుంది...టికెట్ ఇదిగో... నన్ను లోపలికి రానియ్!'' హేమరాజ్ మడమలు పైకెత్తి, తల నిక్కించి, చెయ్యి పైకెత్తి చేతిలో టిక్కెట్ చూపుతూ పెద్ద గొంతుతో అన్నాడు.

''కండెక్టర్! ప్లీజ్ హియర్‌మి!'' వెనుక నుంచి కేక. ఇన్‌షర్టు, టై కట్టుకొన్న కండ్లజోడు మనిషి ''ఇక్కడ ఒక లేడీ పడిపొయ్యింది మిష్టర్! ముందామెను బస్‌లో ఎక్కించు. కడపకు ఒక టికెట్ చించు ఆమెకు.''

''ఆహాఁ! ఆడవాళ్లమీద ఎక్కడా అభిమానం నిండిపోయిందండీ'' ఇంకొక గొంతు వ్యగ్యంగా అంటుంది వెనుక.

''సార్! మీ అడ్వాన్సు టిక్కెట్టిట్లా గిచ్చి లోపలికివచ్చి కూకోండి.''

హేమరాజ్ టిక్కెట్ కండెక్టర్ చేతిలో పెట్టాడు. జనాన్ని తోసుకొనివెళ్లి తలుపు తెరిచాడు.

హేమరాజ్ మెడికల్ రిప్రజెంటేటివ్. చేతిలో బ్రీఫ్‌కేస్, చంకన వాటర్ బాటిల్, ఇంకా ఒక సూట్‌కేస్, రెండు పెద్ద శాంపిల్ ఉడెన్‌బాక్సెస్ అతని లగేజి. ఈ సామానంతా లోపలికి చేరవెయ్యజూస్తున్నాడు.

''సార్! ఆగండి ... ఆగండి! ఎన్ని లగేజీలు సార్! నాలుగు లగేజీలు రాస్తున్నా. లగేజికి నాలుగురూపాయలు. ముందు డబ్బివ్వండి. ఆ చెక్కపెట్టెలు పైకి ఎక్కించైండి. మీరా సూట్‌కేస్‌లు మీకాడ్నే ఉంచేస్కోండి.'' పెన్సిల్ లగేజీలకు టిక్కెట్టు గోకేసింది. ఉడెన్ బాక్సెస్ పైకి జేర్చేటప్పటికి బ్రహ్మదేవుడు కనబడ్డాడు హేమరాజ్‌కి

కండెక్టర్ కండ్లజోడు సరిజేసుకొని రిజర్వేషన్ ప్యాడ్‌లోకి ఎగాదిగా చూసి డ్రైవర్‌కేసి చూసి ''అరే ఏంటిభయ్! ఈసార్‌కి రిజర్వేషన్ ఇచ్చింద్రు. ఇక్కడ మనకు పాడ్ అంతా ఖాళీగా ఇచ్చింద్రు'' అని ఒక తిరకాసువేశాడు.

''అయితే ఏమిటంటావు'' హేమరాజ్ అడిగాడు.

''ఇదిగో దేనికబ్బీ అలా తోసుకుంటారు... అందరికీ ఇస్తార్లేవయ్యా సీట్లు ... ఇట్టా సర్దుకోండి'' తెల్ల గ్లాస్కో పంచెకట్టు మనిషి ... సర్పంచ్ అయ్యుంటాడు. ఎడమ చెయ్యి నడుముపై పెట్టి, కుడిచేత్తో సిగిరెట్టు లాగుతూ ''ఇదిగో చూడూ! బత్తలపల్లి కొక టికెట్ చించూ'' అన్నాడు కండెక్టర్ కేసి.

''బత్తలపల్లిలో ఈ బస్ ఆగదండీ! ఇది ఎక్స్‌ప్రెస్.'' జనంలోనుండే సమాధానం.

''ఏమయ్యా కండెక్టర్! బత్తలపల్లికి... ఏమంటావ్!'' ఎడమచేత్తో కళ్లజోడు సవరించుకున్నాడు.

''కొంచెం తట్కోండి సార్! చార్టు జూస్తాను. ఆఁ! ఏ వూరు సార్ ... ఆఁ ... బత్తలపల్లా ... ఉప్...స్టాప్ లేదుసార్!'' అన్నాడు కండెక్టర్.

''మరి అలాగంటే ఎలాగయ్యా ఎలాగో సర్ది ఒకటి చించు'' మళ్లీ అన్నాడతను.

ఇక లాభంలేదని హేమరాజ్ తలుపు తీసుకొని బస్‌లో ఎక్కి ముందుసీట్లో కూర్చునేశాడు. పెద్దగా ఊపిరి పీల్చుకున్నాడు. చేతులు బాడీ వూచలమీద పెట్టి క్రింద త్రొక్కిసలాడుకుంటున్న జనంవైపు చూస్తున్నాడు.

క్రిందపడ్డ స్త్రీ ఎక్కికూర్చుంది. బస్ తిన్నగా నిండుతూవుంది.

''అయ్యా కండెక్టర్! నా మాట ఏంజేశావు'' పంచెకట్టు మనిషి మళ్లీ గొంతెత్తి మాట్లాడాడు.

''ఏంటి చెయ్యమంటారుసార్! రూల్సు లేవు'' టిక్కెట్లు చించుతూనే అన్నాడు కండెక్టర్.

''రూల్సేమిటయ్యా రూల్సు! టిక్కెట్టు కావలిస్తే ముదిగుబ్బకు చించు. బత్తలపల్లిలో దిగిపోతాను అన్నీ రూల్సే మాట్లాడితే ఎలా'' కసురుగా అన్నాడీసారి.

''అట్టా కుదరదండీ! మీరు తప్పుకోండి సార్! ఇంకొక బండి జూసుకోండి'' కండెక్టర్ విసుక్కున్నాడు. సీటులోనుంచి కదలనేలేదు.

''ఇదో కండెక్టర్! మంచిగా చెబుతున్నా ఈ రూటులోనేగదా నీ బండి రోజూ పోవాల మా యట్టాటివాళ్లను కొంచెం చూసిపోలేకపోతే నీకే ఇబ్బంది'' అన్నాడతను.

తలుపు తెరుచుకొని లోపలికి దూరిపోబోతున్నాడు.

''గిట్టాటి మాటలు నా దగ్గరుడకవు సార్! ముందు మీరు తప్పుకోండి'' చేతితో అతన్ని నెట్టేసి తలుపు దభాలున కొట్టివేసి గొళ్లెం పెట్టేసాడు కండెక్టర్.

బస్సంతా నిండిపోయింది. స్టాండింగ్ టిక్కెట్లు త్రొక్కులాడుకుంటూ నిల్చున్నారు. కండెక్టర్ బెల్లు నొక్కాడు. డ్రైవరు బస్సు స్టార్టు జేశాడు. బండికి పెద్ద జెర్క్ ఇచ్చింది. స్టాండింగ్ ప్యాసెంజెర్లు ముందుకు పడ్డారు. బోయ్‌నెట్‌కేజ్ మీదపడి ఒకాయనకు ముక్కు అదిరింది. రుమాలు రక్తసిక్తమైంది.

''డ్రైవరు క్రొత్తవాడులాగున్నాడు'' వెనక సీట్లో బట్టతలాయన అంటున్నాడు.

''కొంచెం సార్వీసు తక్కువ. లారీల

కెల్తుండిండు దీనికిముందు'' అన్నాడు కండెక్టర్.

''నాలుగు రోజులు పడుతుంది అంతా సర్దుకునేటప్పటికి. డ్రైవరు క్రొత్తవాడు. బస్సురూటూ క్రొత్తదే. బస్సూ క్రొత్తదే'' సిగరెట్ ముట్టిస్తూ అన్నాడొక పెద్దమనిషి.

హేమరాజ్ బస్సంతా కలియజూచాడు. ''పొగ త్రాగరాదు'' ''చేతులు బైట పెట్టరాదు'' ''తలవంచి దిగవలెను.'' ''ప్రజా సేవయే మా పరమావధి'' కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నవి అక్షరాలు.

అనంతపురం — కడప ఆర్. టి. సి. ఎక్స్‌ప్రెస్ బస్ ఎట్లాగైతేనేం అనంతపురం బస్‌స్టాండు వదిలింది. ప్రయాణీకులు గాలి పీల్చుకున్నారు.

* * *

ఎక్స్‌ప్రెస్ బస్ దానిపేరు సార్ధకం జేసుకోవడానికి కాబోలు వాయువేగంతో పరుగిడుతూంది. పి. జి. సెంటర్ ఇంకా కొంచెం దూరం ఉందనగానే కండెక్టర్ లాంగ్‌బెల్ కొట్టాడు. ముందు కూర్చున్న ప్రయాణీకులు గావుకేకలు పెట్టుతూ చప్పట్లు కొట్టడంతో డ్రైవరు బండికి బ్రేక్ వేశాడు. స్టాండింగు ప్యాసింజెర్లంతా మళ్లీ ఒకసారి ముందుకు ఊగారు. ముందు నిల్చున్న ముసలాయన చేతిలో ఇత్తడి క్యారియర్ కదిలింది. లోపలి నెయ్యి ఒలికింది. హేమరాజ్ షర్టు మీద పడింది. వెనుదిరిగి తలెత్తి చూశాడు. వెనకసీట్లో కూర్చున్నాతను నోట్లోనుండి సిగరెట్ పొగ గుప్పుమని వదిలాడు. హేమరాజ్ ముఖం చుట్టేసింది. ఉక్కిరిబిక్కిరి పోయింది. తిక్కపుట్టింది. ముందు సీట్లవాళ్లు డ్రైవర్ని కేకలేస్తున్నారు.

''ఏమిటయ్యా! తప్పుదారి బట్టావు''

''బాబో ఇది కడపదారి కాదు. బెంగుళూరు రోడ్డు''

''ముందు పొయ్యే పుట్టపర్తి బస్సువెంట బడితే ఎట్లాగయ్యా''

''చంపాదురా దేవుడా! ఈ డ్రైవర్ మనల్ని కడప చేర్చడం కల్ల''

తలకొక మాటంటున్నారు. బస్సు అప్పటికే ఒక కిలోమీటరు డైవర్షన్ రోడ్డు దాటివచ్చేసింది.

కండెక్టర్ బస్సు దిగాడు. డ్రైవరు రివర్సు జేస్తున్నాడు. కండెక్టర్ రైట్ చెపుతున్నాడు. బండి డ్యాన్స్ మొదలెట్టింది. గులకరాళ్లు చెంబులో పోసి కదిలించినట్టుంది లోపలి ప్రయాణీకుల పరిస్థితి.

''హోల్డన్! హోల్డన్!'' బస్సుమీద దబదబా బాది అరిచాడు కండెక్టర్. బండి ఆగింది. ఇంకొక క్షణమైతే బస్సు పెద్ద గుంటలో పడిపొయ్యేదే.

వెనక చక్రాలక్రింద రాళ్లు పెట్టారు. బస్సులో జనం సగానికి పైగా క్రిందికి దిగారు. చల్లని గాలి పీల్చుకున్నారు... మళ్లీ సర్కస్ ఫీట్ మొదలైంది. సెల్ఫ్ ఎత్తడం లేదు. క్రిందికి దిగిన ప్యాసెంజర్లు ఒక పట్టు బట్టి నెట్టేశారు. బండిని కడపదారి పట్టించారు. మళ్లీ బస్సులో కలకలం ప్రారంభమైంది.

''గంటకు పైనైంది. పట్టుమని పది మైళ్లు దాటలేదు.''


''బస్సు రూట్లు గవర్నమెంటు తీసేసుకోవడంతో ఇన్ని తిప్పలొచ్చాయండీ.''

''అప్పుడే ఏమయింది. ముందు ముందున్నాయి ప్రయాణీకుల కడగండ్లు.''

''క్రొత్త కదండీ! నాలుగు రోజులైతే అన్నీ సర్దుకుంటాయి.''

''క్రొత్తేమిటండీ క్రొత్త! అలాంటప్పుడు డ్రైవర్నన్నా పాతవాణ్ణి వెయ్యాలి. ఈ లారీ డ్రైవరటండీ మనల్ని కడపకు తోలేది''

హేమరాజ్ ప్రక్కన కూర్చున్న పెద్ద



# బస్ ప్రయాణం

మనిషి సర్కారు జిల్లావాడు. స్వానుభవం చెపుతున్నాడు.

సంవత్సరం క్రితం మాట. ఆర్. టి. సి. బస్ పాలకొల్లు నుండి తిరుపతికి పోతుంది. తనూ దాన్లో ప్రయాణం చేస్తున్నాడు. డ్రైవరూ కండెక్టరూ ఇద్దరూ క్రొత్తవారే. నైట్ సర్వీసు. దారిలో ఒక బస్‌డిపో కాంపౌండులోనికి బస్ మళ్ళించాడు డ్రైవర్. డ్రైవర్, కండెక్టర్ దిగి డిపోలోకి పొయ్యారు. మగత నిద్ర వదిలిన ప్రయాణీకులు ఒళ్ళు విరుచుకున్నారు.

"ఇదేఊరూ!" ఆవులించి అన్నాడొక ప్రయాణీకుడు.

"ఏ. పి. ఆర్. టి. సి. నరసరావుపేట" చదివా డింకొక ప్రయాణీకుడు.

"అరే! ఇదేమిటయ్యా! ఈ రూట్లో నరసరావుపేట రాదే!"

"బహుశః ఇది ఇంకొకరూటు కావచ్చు."

ప్యాసెంజర్లు కొంతమంది బండి దిగారు.

చివరికి తేలింది డ్రైవర్ బస్ రాంగ్ రూట్‌లో తెచ్చాడు. ఈ అవకతవకకు ఏడవడంకంటె నవ్వడమే ఉచితమనిపించింది తెలివిగలిగిన ప్రయాణీకులకు బస్సు వెనక్కి మళ్లింది. ఇరవై కిలోమీటర్లు వెనక్కి నడిచింది. సరైన రూటులో తిరుపతికి చేర్చేటప్పటికి సుప్రభాతం దాటిపొయ్యింది. సర్కారు జిల్లాయనకు ఆనాటి అనుభవం ఈనాటికి గుర్తే

బస్ బత్తలపల్లి కొచ్చింది. పదిమంది ప్రయాణీకులు దారికడ్డంగా నిల్చుని బస్ ఆపేశారు. పెండ్లి కార్యం ఇంకొక బస్ లేదు. కదిరిదాకా సర్దుకోవాలి. కండెక్టర్ ససేమిరా అన్నాడు. "స్టాప్ లేదయ్యో బాబో!" మొత్తుకుంటున్నాడు.

"ఆగిన తర్వాత ఇంకా స్టాప్ లేకపోవడ మేమిటయ్యా! అంతగా అయితే కడపకు రాసుకో టిక్కెట్లు" కొన్ని గొంతులు కలిశాయి

కండెక్టర్ కూర్చున్న సీటునుండి లేవనే లేదు "ఏడెవడో కండెక్టరులాలేడు. (డబ్బు) కలెక్టరులా వున్నాడు" హేమరాజ్‌తో ప్రక్కాయన అన్నమాటలు. కండెక్టర్ మాట ఎవ్వరూ ఖాతరు చేయడంలేదు. తలుపు తీసుకొని లోపలికి దూరిపొయ్యారు. విధిలేక బస్ స్టార్ట్‌చేశాడు డ్రైవర్.

ముదిగుబ్బ ఇక మూడుమైళ్లే వుంది. సిగరెట్ పొగలు బండి నిండిపొయ్యాయి. జనం ఒత్తిడి చాలా ఎక్కువైంది. ఊపిరి పీల్చుకోవడానికి గాలి చాలడంలేదు.

కాకీ బట్టల్లోని బంట్రోతు రోడ్డుకు కర్ర అడ్డంపెట్టి బస్ ఆపేశాడు.

రోడ్డు ప్రక్కన ఈజీచైర్ వేసుకొని కూర్చునివున్నాడు బ్రేక్ ఇన్స్‌పెక్టర్. బ్రేక్ ఇన్స్‌పెక్టర్ అడ్డుపడితే విధిగా ఏ బస్ అయినా బ్రేక్ పడిపోవాల్సిందే. కండెక్టర్ దిగాడు.

బండి ఓవర్‌లోడ్‌లో వుంది. బ్రేక్ ఇన్స్‌పెక్టర్ తీక్షణంగా చూస్తున్నాడు. కండెక్టర్ మెదడు కండిషన్‌లో లేదు.

బ్రేక్ ఇన్స్‌పెక్టర్ కండెక్టర్‌ని ఛడామడా దులిపేస్తున్నాడు మాటలతో. బస్సులో నుండి ఖద్దరు బట్టలాయ నొకతను దిగాడు.

"అరే! మీరెక్కడినుండి వస్తున్నారు." ఖద్దరుబట్ట లతనితో బ్రేక్ ఇన్స్‌పెక్టర్ కరచాలనం చేశాడు.

"బత్తలపల్లిలో ఎక్కాం! కదిరిలో పెండ్లి. ఓవర్‌లోడ్ తప్పిందిగాదు. కండెక్టర్ దేమీ తప్పులేదు. మీరు మమ్మల్ని ఇబ్బంది పెట్టవద్దు . . న మ స్కా ర ం." అయిపోయింది ... దానితో దాసుని తప్పులన్నీ ... సరి అయిపొయ్యాయి కండెక్టర్ బ్రతికి పొయ్యాడు.

> నాయనా! కాలేజిలో జేరపోతున్నావు! అక్కడ అందరు మంచివాళ్లుండరు సిగరెట్లు కాల్చటం అలవాటు చేసుకుంటే చేసుకున్నావుగాని మితంగా కాల్చు" అని హితబోధ చేశాడు రామారావు కొడుక్కి.
>
> "భయపడకండి నాన్నగారూ, నేను నాలుగోఫారంలోనే సిగరెట్లు కాల్చటం మానేశాను." అని అ త ని కొ డు కు అభయం ఇచ్చాడు.

"కండెక్టర్! ఇది గవర్నమెంటు బస్, ఓవర్‌లోడ్ చేయగూడదు ఆ మహానుభావు డుండబట్టి బ్రతికిపొయ్యావీ రోజు...ఆఁ! ... రూట్ పర్మిట్ ఏదీ ?" అడిగాడు

"ఉందిసార్! లోపల డ్రైవరుకాడుంది" మాటల్లో తేల్చివేయజూశాడు కండెక్టర్.

"తీసుకురా! చెక్‌చెయ్యాలి" గదమాయించాడు బ్రేక్ ఇన్స్‌పెక్టర్.

"భయ్! ఆ పర్మిట్ గిట్టా తీసుకురా" కేకేశాడు డ్రైవర్ని కండెక్టర్.

"అరె ఏ పర్మిట్ ఓయ్...అంతా మజాకా జేస్తావ్! నాకింద ఎక్కడుంది పర్మిట్"

పర్మిట్ అనంతపురంలో తీసుకురావడం మరచివచ్చా రిద్దరూ. తల గోక్కున్నాడు కండెక్టర్ నాలుగు చీవాట్లుపెట్టి వార్నింగ్ ఇచ్చి బస్సు వదలిపెట్టాడు బ్రేక్ ఇన్స్‌పెక్టర్.

ఒళ్లు హూనమై, నడుములు పట్టుకుపొయ్యి, కాళ్లీడ్చుకుంటూ విధిలేక నడుస్తున్న ముసలమ్మ నడకతో ఎక్స్‌ప్రెస్ బస్ మూలుగుతూ ముదిగుబ్బ చేరింది. అనంతపురం నుండి ముదిగుబ్బ చేరడానికి మూడుగంటలు పట్టింది. బండిలో పెట్రోల్ అయిపోయింది.

"ఏంటిభయ్! అసలే బండి ఈరోజు మంచిగా నడవడంలేదు . అన్నీ పంచాయితీలే పెట్రోలు బోసుకోందే బస్సు ఎందుకు తీస్కున్నావ్" డ్రై వ ర్‌తో గొణిగాడు కండెక్టర్.

"పూ రా గా పెట్టిపెట్టేనన్నాడుఓయ్ డిపోలో, నేను చెక్‌చెయ్యలేదు" సిగిరెట్ పీలుస్తూ చెప్పాడు డ్రైవర్.

"ఎట్లాభయ్ ఇప్పుడు! ముదిగుబ్బలో మన డిపో లేదే! ప్యాసెంజర్లు మక్కిలిరగ తన్నుతారే." కండెక్టర్ భయం కండెక్టర్‌కుంది. డ్రైవర్ ఏడవడం ఒకటే తక్కువ. మళ్లీ ఖద్దరుబట్టలాయనే ఆదుకున్నాడు పెట్రోల్ బంకులో పెట్రోలు వేయించాడు మర్నాడు రిటర్న్ ట్రిప్‌లో స్పేర్‌గా పెట్రోలు వాపస్‌చేస్తే చాలు

బస్ కదిలింది కాళసముద్రం దాటింది కదిరిలో నరసింహస్వామి దేవాలయం దగ్గర పెండ్లివాండ్లను దింపి బస్ నామా లాడ్జి ముందు ఆగింది ఎలాగూ కడప చేరేటప్పటికి ఆలస్యమౌతుంది. ప్రయాణీకులతో సహా డ్రైవర్, కండెక్టర్ కాఫీ ముగించుకున్నారు.

"ఏమయ్యా డ్రైవర్! కదిరి దాటింది మొదలు అంతా ఘాట్‌రోడ్డు. చీకటిపడింది అన్నీ మలుపులే. అన్నీ మోరీలే. మరి నీ యిష్టం. నీకా స్టీరింగ్ కంట్రోల్ ఉన్నట్లు లేదు. శుభ్రంగా ఇక్కడ బస్ నిలిపెయ్. మా తంటాలేదో మేముపడతాం." బొద్దుగా మీసాలున్న దుక్కలాంటి మనిషి సలహా ఇచ్చాడు. అతనూ డ్రైవర్ అయ్యివుండాలి

డ్రైవర్‌కి గిలి పట్టుకుంది. కడపకు

బండి చేరుస్తామనే ధైర్యం దొరకలేదు.

"ఏమిటయ్యా ఇదంతా! వాట్ నాన్సెన్స్! అడిగేవాడు లేకపోతేసరి! కండక్టర్ బెల్ కొట్టు" గట్టిగా అనేశాడు హేమరాజ్.

"పోనీ భయ్ పోనీ! మొదటి రోజే గిట్లా గైతే గెట్లా" కండక్టర్ బెల్ నొక్కాడు. బస్ కదిలింది.

"ఇదంతా దేశానికి బట్టిన దౌర్భాగ్యం కాకపోతే ఏమిటండీ! బస్సులు జాతీయం చేయడంలో తప్పులేదు. దాన్ని నైపుణ్యంగా నడపడం ముఖ్యం. ఇదంతా ఏమిటి చెప్పండి. అనుభవం ఉన్న సిబ్బందినైనా వేయకపోతే ఎలా చావను. అన్నీ పకడ్బందీగా చేసుకొని రూట్లు స్వాధీనం చేసుకొనుంటే సరిపొయ్యేది." సర్కారు జిల్లా ఆయన అన్నాడు హేమరాజ్‌తో.

"గవర్నమెంటు పనంతా ఇంతేనండీ! ప్రజలు ఇంకా ఎన్ని ఇక్కట్లు పడాలో ఏమో! కనీసం కర్టసీగూడా లేదు సిబ్బందిలో" వెనుక సీటులో బట్టతలాయన అంటున్నాడు.

"ఏదైనా ప్రారంభంలో కొంచెం అవక తవక లుంటాయి. అవే సర్దుకుంటాయి" హేమరాజ్ మనస్సులో అనుకున్నాడు.

ఎక్స్‌ప్రెస్ బస్ ప్యాసెంజర్లను కుదుపు కుంటు ఘాట్‌రోడ్ మీద ఈడ్చుకుంటూ పోతుంది. డౌనులో మంచి స్పీడు పుంజుకుంది. డౌనులోనే పెద్ద మలుపు. డ్రైవర్ స్పీడ్ కంట్రోల్ చేసుకోలేకపోయాడు. టర్నింగ్ తిరుగుతూనే బ్రేక్ పడింది. మోరీ గోడకు గుద్దుకొని బస్ ఆగిపోయింది. మళ్లీ ప్యాసెంజర్లంతా దిగారు.

కారుచీకటి బస్ లైట్లు వేశారు పెద్ద ప్రమాదం తప్పింది. ఇంకొంచెం అయితే బండి పెద్ద వ్యాలీలో పడిపోవాల్సింది అంతా వేళావిశేషం డ్రైవర్‌ది గొప్ప జాతకం.

టైర్ పంక్చరైంది. బండి జాకీమీద కెక్కేసింది కడప నుండి కదిరివైపు ఒక బస్ వస్తూంది. జనమంతా కలిసి బస్ ఆపేశారు. ఆర్. టి. సి. బస్సు కడప నుండి అనంతపురం పోతూంది. ఆ బస్‌లోవాళ్లు గూడా అంతా దిగేశారు. గుంపు గందర గోళంగా ఉంది. పరిస్థితి అయోమయంగా ఉంది. స్టెప్నీ వేసేసారు.

రెండు బస్సుల డ్రైవర్లూ కండక్టర్లూ దూరంగా పోయి మాట్లాడుకుంటున్నారు. తర్జన భర్జనల తర్వాత రెండు బస్సుల డ్రైవర్లూ, కండక్టర్లూ ఒక ఒప్పందానికి వచ్చారు

కడప — అనంతపురం బండి డ్రైవరుకు మంచి అనుభవం ఉంది ఆ రూటులో. దారి తెలియని ఆ ఘాట్‌లో అనంతపురం బండి కడప చేరేకంటె కడప బండి వెనక్కి తిరిగి కడపకు పొయ్యే ప్యాసెంజర్లను తీసుకపోవడం మంచిదని తీర్మానించారు. ఎలాగైనా అక్కడి నుండి తిరిగి అనంతపురం చేర్చడానికి అనంత పురం బండి డ్రైవర్ ఒప్పుకున్నాడు.

అనంతపురం బండిలో వాండ్లందరినీ దిగి కడప బస్ ఎక్కమన్నారు. బిలబిలా త్రోసుకొని బస్ ఎక్కేశారు. మహా రద్దీగా ఉంది. కడప బస్‌లోవాళ్లు దిగి అనంతపురం బండిలో ఎక్కడానికి కొంచెం మొండిజేశారు. చివరికి తప్పిందిగాదు. హేమరాజ్‌లాంటి ప్రయాణీకులకు పోయిన ధైర్యం వచ్చింది

జనం కోలాహలంగా బస్సులు మారుతున్నారు. లగేజీలు మారుస్తున్నారు. త్రొక్కిడి ఎక్కువైంది

హేమరాజ్‌ది కొంత లగేజి బస్‌మీద ఉంది. దింపేందుకు మనిషి లేడు. తనకా అలవాటు లేదు. సహాయం కోరడానికి వ్యవధి లేదు. హడావుడిగా ఎవరి సామాను వాళ్లు మార్చుకోవడంలో నిమగ్నులై ఉన్నారు. శ్వాస

(31 వ పేజీ చూడండి)



# ధర్మపథం

## ఉపదేశం

### బులుసు వేంకటరమణయ్య

ఎవరయినా ఏదయినా మంత్రాన్ని నేర్చుకున్నారంటే ఉపదేశం పొందినట్లు చెప్పడం పరిపాటి. ఉపదేశం పొందడానికి ఇతరుల సాయం కావాలి.. ఆ వ్యక్తే గురువు. మంత్రం నేర్చుకున్నవారు తాము గురూపదేశం పొందామని చెప్పుకుంటారు.

ఈ విధంగా ఉపదేశమనే మాట మంత్రోపదేశాన్ని పొందడంలోనే ప్రసిద్ధమయి ఉన్నది కాని, యథార్థమయిన విషయం ఇది కాదు. పరమైన బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి మనస్సును తగినమార్గంలో గురువు ఉంచడమే ఉపదేశానికి సరియైన అర్థం.

మానవుల మనస్సు సర్వసామాన్యంగా అధోముఖమయి ఉంటుంది అప్పుడు అది లౌకిక విషయాలపయినే వ్యాపిస్తుంది. ఆ యా ఇంద్రియ విషయాలపయి పడి, వ్యక్తికి ఆ యా ఇంద్రియాల సుఖాలను అనుభవించడానికి అభిలాషను — అంటే కోరికను కలుగజేస్తుంది. దర్శనీయమైనదాన్ని చూడాలనే అభిలాష, కర్ణపేయమైనవాటిని వినాలనే ఇచ్ఛ, మధురపదార్థాలను ఆరగించాలనే కోరిక, కమ్మని వాటిని వాసన చూడాలనే ఆసక్తి, మెత్తని పరుపులు మొదలైన వాటి మీద పండుకొని విశ్రాంతి తీసుకోవాలనే వాంఛ అట్టిస్థితిలోనే కలుగుతుంది. మనస్సు స్థిరంగా నిలిచి ఉండక చలిస్తూ ఉండడానికి అది అధోముఖంగా ఉండడమే కారణమని అంటారు.

చాంచల్యం లేకుండా మనస్సును స్థిరంగా నిలపాలంటే — దాని పరిస్థితిలో మార్పు రావాలి అది అధోముఖంగా కాక ఊర్ధ్వముఖంగా ఉండాలి అది సులభసాధ్యం కాదు. గురువు శిష్యునియెడల వాత్సల్యంతో మనస్సును ఊర్ధ్వముఖంగా ఉండేటట్లు చేయడానికి పూనుకొని, తగిన మార్గాన్ని తెలియజేస్తాడు. అలా చెయ్యడమే 'ఉపదే'శానికి సరియైన అర్థమని తత్త్వజ్ఞుల ఆశయం.

ఎడతెగని అభ్యాసంవల్లనేగాని మరొక విధంగా మనస్సు ఆ స్థితికి రాదు.

మనస్సు ఊర్ధ్వముఖంగా ఉన్నట్లయితే అది విషయాలజోలికి పోదు నిర్విషయంగా ఉంటుంది.

నిర్విషయమైన మనస్సే బ్రహ్మానందాన్ని పొందగలదు

ఆ రీతిగా ఉపదేశం పొందజెయ్యడమే దీక్షను ఇవ్వడం.

ఆ పద్ధతి దృగ్దీక్ష, వాగ్దీక్ష, స్పర్శాదీక్ష అనే భేదాలనుబట్టి మూడు విధాలుగా ఉంటుంది.

పోసుకుంటూ బస్ పైకెక్కి ఉడెన్ బాక్సెస్ క్రిందికి దించాడు. సర్కారుజిల్లా ఆయన సాయంజేశాడు. కడప బండి పైన జేర్చాడు. కడప బండి డ్రైవర్ బండిని స్టార్టింగులో పెట్టాడు. జనమంతా సర్దుకున్నారు.

బట్టతలాయన "రండి సార్! మీకు సీటు దొరకదు. స్టాండింగు అయిపోతారు" అన్నాడు హేమరాజ్‌తో.

"నా లగేజి ఇంకా కొంచెం ఆ బస్‌లో ఉండిపోయిందండీ! వెంటనే తీసుకొస్తాను" కండెక్టర్‌తో చెప్పి అనంతపురం బస్‌వైపు పరుగెత్తాడు హేమరాజ్.

అనంతపురం బస్సులోకి దూరేటప్పటికి ఒక ప్రళయమైంది. ప్యాసెంజెర్లు కిక్కిరిసి పోయ్యారు. బ్రీఫ్‌కేస్, సూట్‌కేస్ జనాన్ని తప్పించి బయటికి లాగాడు. కడప పొయ్యే బస్ కదిలింది. సూట్‌కేస్ బస్‌లోనుండి లాక్కోడానికి తన్నుకలాడుతున్నాడు. కడప బస్ బయలుదేరిపోయింది డౌన్‌లో.

"డ్రైవర్! డ్రైవర్!" కేకలేస్తూ పరుగెత్తాడు హేమరాజ్. ఒక చేతిలో బ్రీఫ్‌కేస్, ఇంకో చేతిలో సూట్‌కేస్. బస్సు రెండు మలుపులు తిరిగిపొయ్యిందప్పటికే.

రొప్పుకుంటూ వెనుదిరిగి అనంతపురం బస్ దగ్గరికి వచ్చాడు మళ్లీ. ఆ బస్‌గూడా స్టార్టయింది. బస్‌కు అడ్డంగా నిల్చుని చేతుల్లోని సామానుతోనే పైకెత్తి కేకేసి నిలిపేశాడు బస్సుని.

"ఏంకావాలిసార్ మీకు!" కండెక్టర్ లందుకున్నాడు. "నేనీ బస్సులోనే కదటయ్యా వస్తున్నాను. కడప బస్‌లోకి నా లగేజి కొంత మార్చాను ఈ కేస్‌లు ఇక్కడినుండి తీసుకొని పొయ్యేటప్పటికి వాడు బస్ స్టార్ట్‌చేసి వెళ్లిపొయ్యాడు. నే నెలా పోవాలిమరి. ఆ బస్‌లో పోయిన నా లగేజి ఏంకాను?" అరిచేశాడు హేమరాజ్. గొంతు బొంగురు పొయ్యింది.

"మరిప్పుడేం జేస్తారు సార్? మా కడప డిపో మేనేజర్‌కి రిపోర్టు ఇవ్వండి సార్!" బెల్ నొక్కాడు కండెక్టర్. డ్రైవర్ బస్ స్టార్టుచేశాడు. మళ్లీ బస్‌కు అడ్డంవెళ్లాడు హేమరాజ్.

"రిపోర్టుమాట దేవుడెరుగు. నన్నీ బస్‌లో అనంతపురం చేర్చండి మళ్లీ" అడిగాడు హేమరాజ్.

"మీరు పోవలసింది కడపకుకదు సార్"

## బస్ ప్రయాణం

(23వ పేజీ తరువాయి)

డ్రైవర్ అన్నాడు. అది వ్యంగ్యం అనుకుంటే ఒళ్లు మండిపోతుంది ఎవరికైనా. అమాయకత్వం అనుకుంటే నవ్వడంకంటె చెయ్యగలిగిందేమీ వుండదు.

చిరాకు ముంచుకొచ్చింది హేమరాజ్‌కి. "జోక్ చేస్తున్నావా!" కళ్లెర్రజేసి అన్నాడు డ్రైవర్‌తో.

"ఏంటిభయ్ సార్‌తో మాటలు...యిప్పటికే లేటయిపోయింది ... రండి సార్! కూర్చోండి సర్దుకొనిపోదాం." కండెక్టర్ జాలిజూపాడు. అప్పటికదే పెద్ద మెహర్బానీ.

హేమరాజ్‌కు స్టాండింగే మిగిలింది. బస్సు ఎక్కడెక్కడ ఆగిందో, ఎప్పుడు చేరిందో హేమరాజ్‌కి గమనించడానికికూడా అవకాశంలేదు. గుంపులో నక్కిపోయాడు.

అనంతపురం కడప ఎక్స్‌ప్రెస్ బస్ మధ్యాహ్నం **మూడు**గంటలకు అనంతపురం బస్టాండు వదలి, కదిరి ఘాట్‌రోడ్‌లో ప్యాసెంజర్లను ఎక్స్‌చేంజిచేసి, వెనక్కుతిరిగి మళ్లీ రాత్రి మూడుగంటలకు అనంతపురం చేరింది

మరునాడు ఉదయం హేమరాజ్ అనంతపురం ఆర్. టి. సి. బస్ డిపోకి వెళ్లాడు. డిపో మేనేజర్‌కి లగేజి రికవరీకి కంప్లైంట్ వ్రాసియిచ్చాడు.

అన్నిటికంటె ఆశ్చర్యం బస్సులు ఎక్స్‌ఛేంజి అయిన విషయం డిపో మేనేజర్‌కు తెలియనే తెలియదు.

"ఆల్‌రైట్‌సార్! మీ కంప్లైంటు కడప డిపో మేనేజర్‌కు పంపుతాను. ఎంక్వయిరీకి మిమ్మల్ని పిలుస్తారు." అనంతపురం డిపో మేనేజరిచ్చిన సమాధానం.

నెలరోజుల తర్వాతమాట. కడప డిపో మేనేజర్‌నుండి ఉత్తరం వచ్చింది. హేమరాజ్ ఎంక్వయిరీకి వెళ్లాడు.

ఎంక్వయిరీలో తేలిన విషయం. రెండు బస్సుల డ్రైవర్లూ, కండెక్టర్లూ, ఉమ్మడిగా విడివిడిగా యిచ్చిన స్టేట్‌మెంట్లు "అసలీ హేమరాజ్ ఎవరో మాకు తెలియనే తెలియదు. ఆరోజు బస్సులో ఆయన్ను మేము చూడనేలేదు. ఉడెన్‌బాక్సెస్ ఏవీ బస్సుపైన లేవు" కేసు తేలిపోయింది.

హేమరాజ్‌కి సాక్ష్యంలేదు సర్కారుజిల్లా ఆయన పేరు తనకు తెలియదు సిగరెట్‌పొగ మనిషి ఊరు తను అడగలేదు బట్టతలాయన అడ్రసు తను కనుక్కోలేదు అడ్వాన్సు బుకింగ్‌లో తన పేరు వ్రాయలేదు

కడప డిపో మేనేజర్ సలహా యిచ్చాడు "ఇలాంటి విషయాల్లో ఎవరికివారే జాగ్రత్తగా వుండాలిసార్! ఇప్పుడేమైందో చూడండి ... ఎవ్వరూ ఏమీ చేయలేకపోయ్యాం."

హేమరాజ్‌కి నీరసం వచ్చేసింది. కాళ్లీడ్చుకుంటూ వచ్చి హైదరాబాద్ ఆర్. టి. సి. డీలక్స్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు.

ఎదురుగా విన్డ్ స్క్రీన్‌కు పైభాగంలో, డ్రైవర్ సీటుకు ఎదురుగా వ్రాసిన మాటలు వెక్కిరిస్తూ కన్పించాయి "ప్రయాణీకుల సామానులకు బస్సువారు బాధ్యులుకారు."

